నీరసించిన ఎగుమతులు

21 బిలియన్ డాలర్లకు వాణిజ్యలోటు

న్యూఢిల్లీ, జూలై 15: రికార్డు స్థాయిలో దూసుకుపోయిన ఎగుమతులు మళ్లీ నీరసించాయి. గత నెలలో దేశీయ ఎగుమతులు కేవలం 2.56 శాతం పెరిగి 35.2 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని కేంద్ర ప్రభుత్వం తాజాగా వెల్లడించింది. ఇదే సమయంలో దిగుమతులు 5 శాతం ఎగబాకి 56.18 బిలియన్ డాలర్లకు చేరాయి. దీంతో వాణిజ్యలోటు 20.98 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. క్రితం ఏడాది ఇదే నెలలో 19.19 బిలియన్ డాలర్లుగా ఉన్నది. క్రూడాయిల్, పప్పుదినుసులు, ఎలక్ట్రానిక్స్ వస్తువులు అధికంగా దిగుమతికావడం వల్లనే లోటు అధికంగా పెరిగిందని తెలిపింది. మరోవైపు, ఏప్రిల్ నుంచి జూన్ మధ్యకాలంలో ఎగుమతులు 5.84 శాతం పెరిగి 109.96 బిలియన్ డాలర్లకు చేరుకోగా, దిగుమతులు 7.6 శాతం అధికమై 172.23 బిలియన్ డాలర్లకు చేరాయి. దీంతో వాణిజ్యలోటు 62.26 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.

- చమురు దిగుమతులు 19.62 శాతం పెరిగి 15 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. ఏప్రిల్-జూన్ మధ్య కాలంలో 23 శాతం ఎగబాకి 51.5 బిలియన్ డాలర్లకు చేరాయి.
- కానీ, పసిడి దిగుమతులు 38.66 శాతం తగ్గి 3 బిలియన్ డాలర్లకు పరిమితమయ్యాయి. ఈ ఏడాది తొలి త్రైమాసికంలో 1.91 శాతం పెరిగి 9.51 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.
- గత నెలలో 30.27 బిలియన్ డాలర్ల విలువైన సేవలు ఎగుమతయ్యాయి. అంతక్రితం ఏడాది ఇదే నెలలో 27.79 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి.
- అమెరికా, యూఏఈ, మలేషియా, బంగ్లాదేశ్, తాంజానియా, నెదర్లాండ్స్, సింగపూర్ దేశాలకు ఎగుమతి అవుతున్నాయి.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వస్తువులు, సేవల ఎగుమతులు 800 బిలియన్ డాలర్లకు చేరుకునే అవకాశం ఉన్నది. ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్, ఫార్మా స్యూటికల్స్, కాఫీ, కెమికల్స్ ఉత్పత్తులకు విదేశాల్లో డిమాండ్ ఉండటంతో ఎగుమతుల్లో రెండంకెల వృద్ధి నమోదైంది.

- సునీల్ బార్వాల్, వాణిజ్య శాఖ కార్యదర్శి

రుణగ్రహీతలకు ఎస్బీఐ షాక్



ముంబై, జూలై 15: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) తమ రుణగ్రహీతలకు షాకిచ్చింది. ఆయా కాలవ్యవధులతో కూడిన రుణాలపై వడ్డీరేట్లను పెంచుతున్నట్టు సోమవారం ప్రకటించింది. ఈ క్రమంలోనే మార్జినల్ కాస్ట్ ఆఫ్ ఫండ్-బేస్డ్ లెండింగ్ రేటు (ఎంసీఎల్ఆర్)ను 10 బేసిస్ పాయింట్లదాకా పెంచింది. ఎంసీఎల్ఆర్ అంటే.. కనీస రుణ రేటు. దీనికంటే తక్కువ వడ్డీరేటుకు బ్యాంకులు రుణాలివ్వరాదు. ఎస్బీఐ అధికారిక వెబ్‌సైట్ ప్రకారం పెరిగిన వడ్డీరేట్లు వెంటనే అమల్లోకి వస్తాయి.

ఈఎంఐల భారం

ఎస్బీఐ తీసుకున్న తాజా నిర్ణయంతో ముఖ్యంగా వాహన, గృహ రుణాలు ప్రియమైపోయాయి. ఇప్పటికే ఆటో, హోమ్ లోన్లపై వడ్డీరేట్లు మోయలేనంతగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో వీటి ఈఎంఐలు మరింత పెరిగాయి. కరోనా మహమ్మారి ప్రభావంతో బలహీనపడ్డ దేశ ఆర్థిక వ్యవస్థను బలపర్చేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) 2020లో వడ్డీరేట్లను గణనీయంగా తగ్గించిన విషయం తెలిసిందే. దీంతో అంతా రుణాలు తీసుకున్నారు. అయితే కరోనా పరిస్థితులు అదుపులోకి రావడం, మరోవైపు ద్రవ్యోల్బణం విజృంభించడంతో ధరలను కట్టడి చేయడానికి సెంట్రల్ బ్యాంక్ వడ్డీరేట్లను పెంచుకుంటూపోయింది. వరుస ద్రవ్యసమీక్షల్లో వడ్డనల వల్ల రెపో రేటు గరిష్ఠంగా 6.50 శాతానికి చేరింది. నిరుడు ఫిబ్రవరిలో ఆఖరిసారిగా పెంచగా.. అప్పట్నుంచి రెపో అక్కడే ఉంటున్నది. దీంతో బ్యాంకులూ, ఇతరత్రా బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలూ తమ రుణాలపై వడ్డీరేట్లను ఆ మేరకు పెంచేశాయి. ఫలితంగా వడ్డీరేట్లు తక్కువగా ఉన్నాయని రుణాలు తీసుకున్నవారిపై ఇప్పుడు నెలవారీ వాయిదాల భారం మోయలేని విధంగా తయారైంది. ఇది ఎస్బీఐ రుణగ్రహీతలపై ఇంకా పెరిగిందిప్పుడు. నిజానికి గత నెల జూన్‌లోనూ ఈ రేటే లింకై ఉంటుంది. సిబిల్ స్కోర్ ఆధారంగా ఖాతాదారులు తీసుకున్న రుణాలపై వడ్డీరేట్లు 8.50 శాతం నుంచి 9.65 శాతం మధ్య ఉంటాయి. ప్రాసెసింగ్ ఫీజు తీసుకున్న రుణంలో 0.35 శాతానికి సమానంగా ఉంటుంది. దీనికి వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) అదనం. అయినప్పటికీ మొత్తంగా కనీస ఫీజు రూ.2,000, గరిష్ఠం రూ.10,000గానే ఉంటుంది. ఇక గత ఏడాది జూన్ 15 నుంచి ఎస్బీఐ బేస్ రేటు 10.40 శాతంగానే ఉంటున్నది. అలాగే ఈ ఏడాది జూన్ 15 నుంచి బ్యాంక్ వార్షిక బెంచ్‌మార్క్ ప్రైమ్ లెండింగ్ రేటు (బీపీఎల్ఆర్) 15.15 శాతంగా మారిన విషయం తెలిసిందే.

ఎస్బీఐ రుణాలపై పెరిగిన వడ్డీరేట్లు (శాతాల్లో)

కాలవ్యవధి	ప్రస్తుత ఎంసీఎల్ఆర్	మారిన ఎంసీఎల్ఆర్	పెరుగుదల
ఓవర్‌నైట్	8.10	8.10	యథాతథం
ఒక నెల	8.30	8.35	5 బేసిస్ పాయింట్లు
3 నెలలు	8.30	8.40	10 బేసిస్ పాయింట్లు
6 నెలలు	8.65	8.75	10 బేసిస్ పాయింట్లు
ఏడాది	8.75	8.85	10 బేసిస్ పాయింట్లు
2 ఏండ్లు	8.85	8.95	10 బేసిస్ పాయింట్లు
3 ఏండ్లు	8.95	9.00	5 బేసిస్ పాయింట్లు

ఎంసీఎల్ఆర్‌ను ఎస్బీఐ 10 బేసిస్ పాయింట్ల వరకు పెంచింది. దీంతో అన్ని కన్జ్యూమర్ లోన్లు ఖరీదెక్కాయి.

మారని ఈబీఎల్ఆర్

ఎస్బీఐ ఎక్స్‌టర్నల్ బెంచ్‌మార్క్ లెండింగ్ రేటు (ఈబీఎల్ఆర్) 9.15 శాతం+సీఆర్పీ, బీఎస్పీగానే ఉన్నది. అన్ని గృహ రుణాలకు

బెంగళూరులో జరిగిన టైమ్స్ నౌ ఇండియా ఇన్‌ఫ్రా ట్రాన్స్‌పోర్టేషన్ సమ్మిట్‌లో ఇంపాక్టబుల్ ఇన్‌ఫ్రా లీడర్-2024 అవార్డు అందుకుంటున్న ఎల్ అండ్ టీ మెట్రో ఎండీ ఎస్వీఎస్ రెడ్డి తదితరులు

ఐపీవోకి సాయి లైఫ్ సైన్సెస్!

న్యూఢిల్లీ, జూలై 15: హైదరాబాద్ కేంద్రస్థానంగా కార్యకలాపాలు అందిస్తున్న సాయి లైఫ్ సైన్సెస్..స్టాక్ మార్కెట్లోకి అడుగుపెట్టబోతున్నది. ఇందుకు సంబంధించి స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీకి దరఖాస్తు చేసుకున్నది కూడా. వ్యాపార విస్తరణకోసం అవసరమయ్యే నిధుల్లో రూ.800 కోట్ల నిధులను ఐపీవో ద్వారా సేకరించడానికి సిద్ధమైంది. ప్రమోటర్లు, షేరుహోల్డర్లు, ఇన్వెస్టర్ షేరుహోల్డర్లకు చెందిన 6.15 కోట్ల విలువైన షేర్లను ఆఫర్ ఫర్ సేల్ రూట్‌లో విక్రయించనున్నారు. వాటాలు విక్రయించనున్న ప్రమోటర్లలో సాయి క్విస్ట్ సైన్ ప్రైవేట్ లిమిటెడ్, టీపీజీ ఆసియా 8 ఎస్ఎఫ్ పీటీఈ లిమిటెడ్, హెచ్‌బీఎం ప్రైవేట్ ఈక్విటీ ఇండియాలు ఉన్నాయి.

బీవోబీ మాన్‌సూన్ ధమాకా డిపాజిట్ స్కీం

న్యూఢిల్లీ, జూలై 15: ప్రభుత్వ బ్యాంకింగ్ దిగ్గజాల్లో ఒకటైన బ్యాంక్ ఆఫ్ బరోడా(బీవోబీ).. మాన్‌సూన్ ధమాకా డిపాజిట్ స్కీంను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ స్కీం కింద 399 రోజుల కాలపరిమితి కలిగిన రిటైల్ టర్మ్ డిపాజిట్లపై 7.25 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్న బ్యాంక్..333 రోజుల కాల పరిమితిపై 7.15 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్నది. అలాగే సీనియర్ సిటిజన్లకు అదనంగా మరో అర శాతం వడ్డీని చెల్లిస్తుండటంతో 7.65 శాతం నుంచి 7.75 శాతం మధ్యలో వడ్డీని ఆఫర్ చేస్తున్నది. రూ.3 కోట్ల లోపు టర్మ్ డిపాజిట్లకు ఈ ప్రత్యేక స్కీం వర్తించనున్నదని పేర్కొంది.



రాష్ట్ర మార్కెట్లోకి అపాచీ సరికొత్త బైకు

ధర రూ.1.20 లక్షలు

హైదరాబాద్, జూలై 15: టీవీఎస్ మోటర్.. రాష్ట్ర మార్కెట్లోకి సరికొత్త అపాచీ 160 సిరీస్ డార్క్ ఎడిషన్‌గా విడుదల చేసింది. వీటిలో టీవీఎస్ అపాచీ ఆర్‌టీఆర్ 160 మాడల్ ధర రూ.1,09,990, అపాచీ ఆర్‌టీఆర్ 160 4వీ మాడల్ ధర రూ.1,19,900గా నిర్ణయించింది. ఈ ధరలు హైదరాబాద్ షోరూంనకు సంబంధించినవి. ఈ సందర్భంగా కంపెనీ బిజినెస్ హెడ్ విమల్ సుంబ్లే మాట్లాడుతూ.. 160 సీసీ ఇంజిన్ సామర్థ్యంతో రూపొందించిన ఈ రెండు మోటర్‌సైకిళ్లు 17.6 పీఎస్ 9250 శక్తినివ్వనున్నదని, యువతకు నచ్చే విధంగా వీటిని రూపొందించినట్లు చెప్పారు. డిజిటల్ ఎల్‌సీడీ క్లస్టర్, ఎల్‌ఈడీ హెడ్‌ల్యాంప్, యాంటీ బ్రేక్ సిస్టమ్‌వంటి ఫీచర్స్ ఉన్నాయి.

చెప్పేది విన్నాకే..

ఫ్రాడ్ రిస్క్ మేనేజ్‌మెంట్ మార్గదర్శకాలను మార్చిన ఆర్బీఐ

ముంబై, జూలై 15: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) సోమవారం ఫ్రాడ్ రిస్క్ మేనేజ్‌మెంట్‌పై తమ మాస్టర్ డైరెక్షన్స్‌ను సవరించింది. ఏదైనా ఖాతాను మోసంగా ప్రకటించే ముందు సదరు ఖాతాదారుడు లేదా రుణగ్రహీత చెప్పేది బ్యాంకులు (రుణదాతలు) వినాలన్న సుప్రీం కోర్టు తీర్పు సిఫార్సు మేరకే ఈ మార్పులు చేసింది. ఎస్బీఐ, రాజేశ్ అగర్వాల్ కేసులో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని ధర్మాసనం.. రుణగ్రహీతల హక్కులను గౌరవించాలని పేర్కొన్నది. ఈ క్రమంలోనే ఖాతాను మోసంగా వర్గీకరించే ముందు సదరు రుణగ్రహీత చెప్పినదాన్ని విని ఓ నిర్ణయానికి రావాలన్నది. దీంతో ఇకపై బ్యాంకులు దీన్ని అనుసరించాల్సిందేనంటూ ఆర్బీఐ తాజా మార్గదర్శకాల్లో స్పష్టం చేసింది.

టీ హబ్‌ను ఇన్‌ఫ్రా కార్పొరేట్ ఎక్సలెన్స్ అవార్డు వరించింది. కూరగాయల వ్యర్థాలను అధిక పోషక కంపోస్ట్ ఎరువుగా తయారు చేసి, వాటిని తిరిగి తమ ప్రాంగణంలో ఉన్న చెట్లకు వాడామని టీ హబ్ సీఈవో ఎంఎస్ రావు తెలిపారు. అదేవిధంగా ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి లీస్టైకింగ్ చేశామని, ఈ రెండు చర్యలకు గాను అవార్డు దక్కిందని ఆయన వెల్లడించారు.

టీసీఎస్‌లో ఫ్రెషర్లకు 40 వేల ఉద్యోగాలు!

న్యూఢిల్లీ, జూలై 15: దేశీయ టెక్నాలజీ దిగ్గజం టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్(టీసీఎస్)..ఫ్రెషర్లకు పెద్దపీట వేస్తున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి 40 వేల మంది ఫ్రెషర్లను నియమించుకునేయోచనలో సంస్థ ఉన్నది. గత ప్రమాసికంలో కొత్తగా 5,452 మందిని రిక్రూట్ చేసుకోవడంతో మొత్తం సంఖ్య 6,06,998కి చేరుకున్నారు. ప్రపంచ ఐటీ రంగంలో గణనీయమైన మార్పులకు లోనవుతున్న ప్రస్తుత తరుణంలో భారత్ ప్రతిభకు కేంద్రంగా మారిందని, భవిష్యత్తులో మార్పులు వచ్చే అవకాశాలు కనిపించడం లేదని టీసీఎస్ సీహెచ్ఆర్‌వో మిలింద్ లక్కాడ్ తెలిపారు.

ఆల్‌టైమ్ కనిష్ఠానికి రుపీ

మరో 10 పైసలు క్షీణించిన విలువ

83.61 స్థాయికి పతనం

ముంబై, జూలై 15: డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ మునుపెన్నడూ లేని స్థాయికి దిగజారింది. సోమవారం ఆల్‌టైమ్ కనిష్ఠాన్ని తాకుతూ 83.61కి పడిపోయింది. గత శుక్రవారం ముగింపుతో చూస్తే 10 పైసలు తగ్గింది. ఒకానొక దశలో 83.62 స్థాయికి నష్టపోయింది. అయితే తిరిగి స్వల్పంగా కోలుకున్నది.

ద్రవ్యోల్బణం దెబ్బ

దేశీయంగా విజృంభిస్తున్న ద్రవ్యోల్బణం.. రూపాయిని ప్రభావితం చేస్తున్నట్టు బీఎన్పీ పరిబాస్‌కు చెందిన షేర్‌ఖాన్‌లో రిసెర్చ్ అనలిస్ట్‌గా ఉన్న అనుజ్ చౌధరి విశ్లేషించారు. ఈ క్రమంలోనే భారతీయ స్టాక్ మార్కెట్లు రికార్డు స్థాయి లాభాల్లో ముగిసినా.. ఆ ఉత్సాహాన్ని అందుకోలేకపోయినట్టు చెప్తున్నారు.

వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

దేవుడి గుడికే కన్నం

- ఆలయాల్లో వరుస చోరీలు.. ఉమ్మడి జిల్లా దొంగల పనే
- పోలీసుల అదుపులో ముఠా.. ఇద్దరి అరెస్ట్
- బంగారు ఆభరణాలు స్వాధీనం
- ఈజీ మనీ లక్ష్యంగా ఆలయాల్లో చోరీలు

రాజన్న సిరిసిల్ల, జూలై 15 (నమస్తే తెలంగాణ): ఈజీ మనీయే లక్ష్యంగా దేవుడి గుడికే కన్నం పెడుతూ దొంగతనాలకు పాల్పడుతున్న ముఠాను సిరిసిల్ల పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. రాజన్న సిరిసిల్ల, జగిత్యాల, సిద్దిపేట, కరీంనగర్, ఇతర జిల్లాల్లోని దేవుడి సొమ్ము చోరీ చేసిన ఇద్దరు దొంగలను అరెస్ట్ చేసి కటకటాల్లోకి పంపించారు. ఈ మేరకు సిరిసిల్ల ఎస్పీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ అఖిల్ మహాజన్ వివరాలు వెల్లడించారు. హుస్నాబాద్ మండలం అంకుసాపూర్‌కు చెందిన శివరాత్రి సంపత్ (30) ప్రస్తుతం వేములవాడ మండలం ఫాజుల్‌నగర్‌లో ఉంటున్నాడు. ఇతను బావులలో పూడికతీసే పనులు చేస్తుండేవాడు. అయితే వేములవాడ మండలం అగ్రహారానికి చెందిన అల్లిపు పర్శరాం (21) ఇతనితో పనిచేస్తుండేవాడు. ఈజీ మనీ లక్ష్యంగా ఆలయాల్లో దొంగతనాలు చేయాలని ప్లాన్ వేసుకున్నారు. ఈ క్రమంలో గత మే నుంచి ఆలయాల్లో దొంగతనాలు చేశారు. ఇంకా గొర్రెలు, బైక్‌ను కూడా ఎత్తుకెళ్లారు. నిందితులపై సిరిసిల్ల జిల్లాలో 12, జగిత్యాల జిల్లాలో 2, కరీంనగర్ జిల్లాలో 2, సిద్దిపేట జిల్లాలో ఒక కేసు నమోదు చేశారు. దొంగలను చాకచక్యంగా పట్టుకున్న రూరల్ సీఐ మొగిలి, ఎస్ఐ శ్రీకాంత్, హెడ్ కానిస్టేబుల్ మధు, చంద్రశేఖర్‌లను ఎస్పీ అభినందించారు. సమావేశంలో డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ మొగిలి, ఎస్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

దళితబంధు ఖాతాలపై ఫ్రీజింగ్ ఎత్తేయాలి

కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట లబ్ధిదారుల ఆందోళన

కలెక్టరేట్ ఎదుట ఆందోళన చేస్తున్న దళితబంధు లబ్ధిదారులు

కలెక్టరేట్, జూలై 15: దళితబంధు ఖాతాలపై ప్రభుత్వం విధించిన ఫ్రీజింగ్ ఎత్తేయాలని హుజూరాబాద్ నియోజకవర్గానికి చెందిన 50 మంది లబ్ధిదారులు డిమాండ్ చేశారు. కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట సోమవారం ఆందోళనకు దిగారు. రెండు గంటలకు పైగా కార్యాలయం ఎదుట బైఠాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడు నెలలు దాటినా ఖాతాల్లోని దళితబంధు నగదును విడిపించుకొనే అవకాశం ఇవ్వకపోవడం అన్యాయమని మండిపడ్డారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ప్రభుత్వ మొండి వైఖరితో అప్పులు తెచ్చి వ్యాపారాలు నిర్వహించుకోవాల్సి వస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా దళితబంధు సాధన సమితి హుజూరాబాద్ నియోజకవర్గ కన్వీనర్ కొలుగూరి సురేశ్ రేవంత్ సర్కారుపై విమర్శలు గుప్పించారు. దళితుల బతుకుల్లో వెలుగులు నింపేందుకు బీఆర్ఎస్ సర్కారు తెచ్చిన దళితబంధు పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు యత్నిస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు దళితబంధును రూ.12 లక్షలకు పెంచుతామని ప్రగల్భాలు పలికిన ముఖ్యమంత్రి ఇప్పుడు పట్టించుకోవడంలేదని విమర్శించారు. హుజూరాబాద్‌లో 5 వేల మంది లబ్ధిదారులు రెండో విడుత దళితబంధు నిధులందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. బీఆర్ఎస్ సర్కారు తమకు మేలు చేసిందనే అక్కసుతోనే రేవంత్ సర్కారు దళితులపై కక్ష కట్టిందన్నారు. ఇప్పటికైనా స్పందించి ఖాతాల్లోని నగదును వినియోగించుకొనే అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే దళితజాతి ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఆందోళనలో లబ్ధిదారులు మారెపల్లి భాగ్యమ్మ, కొత్తూరు కాంతమ్మ, ఆరెపల్లి సరిత, మేకల వెంకటేశ్, దేవరకొండ సరిత, కొలుగూరి నరేశ్, రామంచ రాకేశ్ పాల్గొన్నారు

బతుకులు బజారున పడతయ్..

దళితబంధు కింద కేసీఆర్ ప్రభుత్వం మాకు యూనిట్ మంజూరుచేసింది. మొదటి విడుత వచ్చిన రూ. 5లక్షలతో దుకాణం పెట్టుకొనేందుకు మడిగెకు కిరాయికి తీసుకున్నం. రెండో విడుత నగదు వస్తే సామగ్రి తెచ్చుకుందామని ఆరు నెలలుగా ఎదిరిసుత్తున్నం. అయితే ప్రభుత్వం పైసలు ఇడిపించుకొనే అవకాశం ఇవ్వలేదు. దీంతో అరిగోస పడుతున్నం. అప్పులు పెరిగిపోతున్నయ్. మడిగెకు ఆరు నెలలుగా కిరాయి కడుతున్నం. ఇప్పటికైనా డబ్బులు విడుదల చేయాలె. లేకుంటే మా బతుకులు బజారున పడతయ్.

- మారెపల్లి భాగ్యమ్మ, లబ్ధిదారు (హుజూరాబాద్)

సంఘటితమై తిరుగబడతం..

దళితుల అండతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పుడు మమ్ములను దగా చేస్తున్నది. దళితబంధు కింద మంజూరైన రెండో విడుత నిధులను ఫ్రీజ్ చేయడం ఎంత వరకు కరెక్ట్. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకుంటలేరు. రేపుమాపు అంటూ మాయమాటలు చెప్పి తప్పించుకుంటున్నరు. ఇప్పటికైనా ఖాతాల్లోని నగదును విడిపించుకొనే అవకాశం కల్పించాలె. లేదంటే రాబోయే రోజుల్లో దళితులంతా సంఘటితమై తిరగబడతం.

- కే నరేశ్, లబ్ధిదారుడు, (జమ్మికుంట)

ఉద్యాన శాఖలో కదలిక

- కూరగాయల రైతులకు నారు అందించేందుకు సిద్ధం
- సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు దరఖాస్తుల ఆహ్వానం

కరీంనగర్, జూలై 15 (నమస్తే తెలంగాణ) : 'నమస్తే తెలంగాణ' కథనం ఉద్యాన శాఖలో కదలిక తెచ్చింది. సిద్దిపేట జిల్లా ములుగులో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీవోఈ)లో మొక్కలు పెంచి ఇవ్వడంలో నిర్లక్ష్యం ప్రదర్శించడంపై ఈ నెల 14న 'ఉద్యానరైతుకు ఉత్తచేయి' శీర్షికన ప్రచురితమైన ఈ కథనంపై ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి బండారి శ్రీనివాస్ స్పందించారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో కూరగాయల రైతులకు టమాట, మిరప నారు రాయితీపై అందించేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ నుంచి యాక్షన్ ప్లాన్ కూడా ఇచ్చారని చెప్పారు. గతంలో కరీంనగర్ జిల్లాలో 32.5 ఎకరాలకు, జగిత్యాలలో 25, సిరిసిల్లలో 32, పెద్దపల్లిలో 35 ఎకరాలకు సరిపడా నారు అందించామని, ఈ సంవత్సరం కూడా 150 ఎకరాలకు నారు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఆయా జిల్లాల ఉద్యాన అధికారుల నుంచి సమాచారం తీసుకుని రైతులు నారు కోసం దరఖాస్తులు చేసుకోవాలని కోరారు. కరీంనగర్ జిల్లాకు సంబంధించి కరీంనగర్ (8977714035), మానకొండూర్ (8977714034), హుజూరాబాద్ (8977714032), చిగురుమామిడి (8977714037), చొప్పదండి (8977714036) అధికారులను సంప్రదించి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

జాప్యానికి కారణం?

ములుగు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ 2019లో ప్రారంభమైంది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఉద్యాన రైతులకు టమాట, మిరప నార్లు రాయితీపై ఇస్తున్నారు. అందు కోసం ప్రతి సంవత్సరం మే చివరి వారంలో గానీ, జూన్ మొదటి వారంలోగానీ ప్లాంటేషన్ చేస్తున్నారు. కానీ, ఈ సారి ప్లాంటేషన్ మిషన్ చెడిపోవడంతో ఈ ప్రక్రియ పూర్తిగా ఆగిపోయినట్టు తెలుస్తున్నది. ఈ నేపథ్యంలో 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన కథనంపై అధికారులు స్పందించారు. యుద్ధ ప్రాతిపదిక ప్లాంటేషన్ మిషన్‌కు మరమ్మతులు చేయించి నార్లు పోసినట్టు తెలిసింది. ఆగస్టు చివరి వారంలోనైనా ఈ నార్లు అందుబాటులోకి వస్తాయని రైతులు ఆశిస్తున్నారు. 'నమస్తే తెలంగాణ' వల్లే సమస్యకు పరిష్కారం దొరికిందని హర్షం వ్యక్తం చేస్తున్నారు

డ్రగ్స్ గుట్టు కోసం జాగిలం వేట

- పోలీసుల వినూత్న ప్రయోగం
- వేములవాడలో విస్తృత తనిఖీలు

జాగిలాలతో తనిఖీ చేస్తున్న పోలీసులు

వేములవాడ, జూలై 15: గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల నిర్మూలనకు పోలీసులు కొత్త ఎత్తుగడలతో ముందుకుసాగుతున్నారు. నార్కోటిక్స్ డిపార్ట్‌మెంట్‌లో ప్రత్యేక శిక్షణ పొందిన పోలీసు జాగిలంతో సోమవారం వేములవాడలో తనిఖీలు చేపట్టారు. ఎస్పీ అఖిల్ మహాజన్ ఆదేశాల మేరకు బస్టాండ్, పాన్‌షాప్‌లు, కిరాణాషాపులు, హోటళ్లు, అనుమానాస్పద ప్రాంతాల్లో సోదాలు చేశారు. ఈ సందర్భంగా సీఐ వీరప్రసాద్ మాట్లాడుతూ సిరిసిల్లను గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు చిత్తశుద్ధితో ముందుకు సాగుతున్నామన్నారు. నిషేధిత మత్తు పదార్థాలు విక్రయించినా, కొనుగోలు చేసిన వారి సమాచారాన్ని 100 డయల్‌కు ఫోన్ చేయాలని సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు.

సమస్యలు పరిష్కరించండి

- అంగన్‌వాడీ టీచర్ల డిమాండ్

ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

జగిత్యాల, జూలై 15: సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అంగన్‌వాడీ టీచర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం సీఐటీయూ ఆధ్వర్యంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ క్యాంపు ఆఫీస్ ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడారు. జీవో 10ను రద్దు చేసి గత ప్రభుత్వం నిర్ణయించిన మేరకు రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను అంగన్‌వాడీ టీచర్లకు ₹2లక్షలు, హెల్పర్లకు ₹లక్ష ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీఆర్ఎస్ సౌకర్యం కల్పించాలని, హెల్పర్లకు పాత విధానంలోనే ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జీవో 10ను తెచ్చి 65 ఏండ్లు నిండిన వారిని జూలై ఒకటిన విధుల నుంచి తొలగించడం అన్యాయమన్నారు. అధికారంలోకి వస్తే ₹18వేల వేతనం, ఫీఎఫ్ సౌకర్యం కల్పిస్తామని ఎన్నికల మ్యానిఫెస్టోలో చేర్చిన కాంగ్రెస్ ఇప్పుడు అధికారంలోకి వచ్చి ఏడు నెలలు దాటినా పట్టించుకోవడంలేదని ఆరోపించారు. ఇప్పటికైనా న్యాయం చేయాలని, లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం ఎమ్మెల్యే కాంపు కార్యాలయ పీఏకు వినతిపత్రం అందించారు.

విద్యుత్ పంపిణీలో పెద్దపల్లి జిల్లా టాప్

టీఎస్ఎన్పీడీసీఎల్ పరిధిలో ప్రథమ స్థానం

పెద్దపల్లి, జూలై 15: విద్యుత్ పంపిణీ, బిల్లుల వసూలు, నాణ్యమైన విద్యుత్ సరఫరా తదితర విభాగాల్లో తెలంగాణ నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ పరిధిలోని 16 జిల్లాలో పెద్దపల్లి జిల్లాకు ప్రథమ స్థానం లభించిందని విద్యుత్ ఎస్ఈ సుదర్శన్ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో వివరాలు వెల్లడించారు. 2024 మే నెలకు సంబంధించి ఈ ఘనత దక్కించుకున్నదని ఎన్పీడీసీఎల్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ వరుణ్‌రెడ్డి వెల్లడించినట్లు పేర్కొన్నారు. జిల్లా పరిధిలో పెద్దపల్లి డివిజన్ ప్రథమ స్థానం, ధర్మారం, సుల్తానాబాద్ సబ్ డివిజన్‌కు ప్రథమ, ద్వితీయ